# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వివిధ రంగాల్లో 39 వేల 436 కోట్ల రూపాయల విలువైన 31 ప్రాజెక్టుల ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడులు ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలియజేసింది.
- ❖ వచ్చే ఏడాది జూన్ నాటికి వెలిగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- ❖ విశాఖపట్నంలోని రుషికొండ భవనాల వినియోగంపై తుది నివేదికను సిద్ధం చేసినట్లు మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.
- ❖ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు.
- ❖ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులు తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==================

పరిశ్రమలు, విద్యుత్, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో 39 వేల 436.84 కోట్ల రూపాయల విలువైన 31 ప్రాజెక్టుల ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడులు ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలియచేసింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 16వ ఎస్ఐపీబీ సమావేశం ఈరోజు జరిగింది. ఈ ప్రాజెక్టుల ద్వారా లక్షా 11 వేల 278 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. అమరావతి క్వాంటం వ్యాలీలో 3 సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహక బోర్డు అంగీకారం తెలిపింది. సాగు వ్యర్థాల సద్వినియోగం కోసం యూనిట్ల ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదించింది. ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పత్తి పెంపునకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని, ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించాలని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఉత్పాదనకు అనుగుణంగా భవిష్యత్‌లో ఆ విద్యుత్ ను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసేలా ట్రాన్స్ మిషన్ లైన్లను కూడా సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రంలో జీసీసీల ఏర్పాటుపై కూడా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి కోరారు. ఆంధ్రప్రదేశ్ జీసీసీలకు కేంద్రంగా మారాలన్నారు. వ్యవసాయం,

ఉద్యాన, ఆక్వా కల్చర్ రంగాల్లో వస్తున్న వ్యర్థాలను సద్వినియోగం చేసుకునేలా ప్రాజెక్టులను ఆహ్వానించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

=================

వచ్చే ఏడాది జూన్ నాటికి వెలిగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్ట్ లోని హెడ్ రెగ్యులేటర్లు, రెండవ సొరంగంలోని టీబీఎం మిషన్ ను ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్ట్ తో ఉమ్మడి ప్రకాశం జిల్లా వాసుల జీవితాల్లో వెలుగులు నిండుతాయన్నారు. హెడ్ రెగ్యులేటర్ రిటైనింగ్ వాల్, వింగ్స్ కు సంబంధించి 70 శాతం పని పూర్తి అయిందన్నారు. టన్నెల్ -2లో మిగిలిన పనులను జూన్ నాటికి పూర్తి చేస్తామని, ఈ నెల నుంచి నిర్వాసితుల కుటుంబాలకు ఆర్ & ఆర్ బిల్లులు జమ చేస్తామని మంత్రి వెల్లడించారు.

=================

విశాఖపట్నంలోని రుషికొండ భవనాల వినియోగంపై తుది నివేదికను సిద్ధం చేశామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ 5వ సమావేశం ఈ రోజు జరిగింది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో గత 4 భేటీల్లో తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. మంత్రి కందుల దుర్గేష్ తో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి దృశ్య మాధ్యమం విధానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ... రుషికొండ ప్యాలెస్‌ను ప్రజల సందర్శనకు అనుమతించడంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మార్చే దిశగా చర్చలు జరిగాయని తెలియజేశారు. ఈ భవనాల నిర్వహణకు తాజ్, ఎట్మాస్ఫియర్ కోర్, లీలా, ఫెమా వంటి అంతర్జాతీయ హోటల్ గ్రూపులు ఆసక్తి చూపుతున్నాయని, ఈ అంశంపై కూడా కమిటీ చర్చించిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

=================

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. సాలూరు పట్టణంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులు అధిక వ్యయంతో యంత్రాలు కొనుగోలు చేయలేని పరిస్థితుల్లో.. కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా తక్కువ ఖర్చుతో అవసరమైన పరికరాలను వినియోగించుకునే అవకాశం కల్పిస్తునట్లు తెలిపారు. రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ప్రతి మండలానికి ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తోందని మంత్రి వెల్లడించారు. ట్రాక్టర్‌తో పాటు పవర్ స్ప్రేయర్, వీడర్, టార్పాలిన్ వంటి ఉపకరణాలు కూడా అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. వ్యవసాయ ఖర్చులను తగ్గించి రైతులకు అధిక లాభాలు చేకూర్చడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని మంత్రి పేర్కొన్నారు.

విరామం

=================

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని డాక్టర్ అంబేద్కర్ ఫౌండేషన్, దేశవ్యాప్తంగా ఉన్న డాక్టర్ అంబేద్కర్ చైర్ల `నేషనల్ పోర్టల్` కోసం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చైర్‌ను `నేషనల్ నోడల్ సెంటర్`గా అధికారికంగా నియమించింది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని డాక్టర్ అంబేద్కర్ చైర్ల డిజిటల్ ఎకోసిస్టమ్‌ను సమన్వయం చేయడం, నిర్వహించడం, బలోపేతం చేయడంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇప్పుడుకీలకంగా వ్యవహరించనున్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకలు జరుగుతున్న తరుణంలో ఈ గుర్తింపు లభించడం విశేషం.

==================

విశాఖపట్నంలోని షీలానగర్‌లో నిర్మిస్తున్న ఈఎస్ఐ ఆసుపత్రి పనులను స్థానిక పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్ ఈరోజు పరిశీలించారు. ప్రాజెక్ట్ పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించిన ఆయన... నిర్మాణ నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. 400 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆధునిక ఆసుపత్రి నిర్మాణం వేగంగా జరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణ పనులు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను అత్యుత్తమ నాణ్యతతో పూర్తి చేయాలని ప్రాజెక్ట్ బృందానికి ఎంపీ సూచించారు. రానున్న రెండు, మూడు నెలల్లో ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉందని, తదనంతరం సిబ్బంది నియామక ప్రక్రియ పూర్తయిన వెంటనే సేవలు ప్రారంభమవుతాయని ఎంపీ పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

==================

దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ఈ రోజు బలహీనపడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ఫలితంగా ఉత్తర కోస్తాంధ్రప్రదేశ్ లో రానున్న రెండు రోజులు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ పేర్కొన్నారు. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశ ముందని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించారు. కోస్తాంధ్రప్రదేశ్, రాయలసీమలో రాగల 5 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదులో మార్పు లేదని తెలియజేశారు.

==================

ట్రాన్స్‌జెండర్ల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. విజయవాడలో ఈరోజు జరిగిన ఆంధ్ర స్వాభిమాన సభలో ఆమె మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్లు సమాజంలో ఇతరులపై ఆధారపడకుండా.. స్వయం ఉపాధితో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ట్రాన్స్‌జెండర్లకు పింఛన్‌తో పాటు ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని ట్రాన్స్‌జెండర్ల కోసం ఉపాధి హామీ పథకం కార్డులు అందజేస్తున్నామని, తాజాగా వారి సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేశామని ఆమె వెల్లడించారు.

==================

రాష్ట్ర ప్రభుత్వం భూగర్భ జలాల స్థాయిని గణనీయంగా పెంచేందుకు జలధార కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తోందని పోలవరం జిల్లా కలెక్టర్ కే. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. జలధార కార్యక్రమం అమలుపై ఈరోజు అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పోలవరం జిల్లాలో ప్రస్తుతం సగటు 8 మీటర్లలో ఉన్న భూగర్భ జలాల స్థాయిని 3 మీటర్లకు తీసుకురావడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. గ్రామ స్థాయిలో నీటి సంరక్షణ, వాటర్ బడ్జెటింగ్, చెరువుల పునరుద్ధరణ, కాలువల పూడికతీత, ఫీడర్ ఛానల్స్ శుభ్ర పరచడం, చెరువుల అనుసంధానం వంటి పనులను సమగ్రంగా చేపట్టాలని సూచించారు.

==================

రాష్ట్రాన్ని డిజిటల్ భద్రతలో అగ్రగామిగా నిలపాలనే ఉద్దేశంతో దేశంలోనే అత్యంత ఆధునిక సాంకేతిక ప్రమాణాలతో "సైబర్ సెక్యూరిటీ ఆపరేషనల్ సెంటర్ (APCSOC)" ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేశామని ఆ సంస్థ చైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలియజేశారు. విజయవాడలో ఈరోజు నిర్వహించిన వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ... సైబర్ సెక్యూరిటీ ఆపరేషనల్ సెంటర్ ద్వారా ప్రభుత్వ విభాగాలు, పౌరుల డేటాకు సమగ్ర రక్షణ కల్పిస్తూ.. సైబర్ దాడులను ముందుగానే గుర్తించి సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామన్నారు. దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ద్వారా వెయ్యికి పైగా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశామని తెలియజేశారు.

==================

కేంద్ర గణాంక, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ సౌరభ్ గార్గ్ రేపు విశాఖపట్టణం రానున్నట్లు జాతీయ గణాంక కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన జాతీయ గణాంక ఉప ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శిస్తారని, నేషనల్ హౌస్‌హోల్డ్ ఇన్‌కమ్ సర్వే ఫీల్డ్ వర్క్ ఏర్పాట్లను సమీక్షించి, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు.

==================

==================